కథ

# తొలిప్రేమకు గుడ్ బై

**మువ్వా శ్రీనివాస్**

**ఆ రోజు వనమాలికి పెళ్ళిచూపులు!**

**పెళ్ళిచూపులు కదాని ఓ అంగుళం మందాన మేకప్ ప్యాడ్ ముఖానికి పట్టించి ఫ్యాషన్ పెరేడ్‌కెళ్తున్నట్టు కొత్త పట్టుచీర కట్టుకుని మెరుపుతీగలా తయారవ్వడం ఆమెకస్సలు ఇష్టముండదు.**

**అందుకనే రోజూలాగే క్యాజువల్‌గానే తయారయ్యింది. ఆ మధ్యేదో ఫంక్షన్‌కెళ్తూ కట్టుకుని వచ్చి విప్పేసి హ్యాంగర్‌కు తగిలించిన గద్వాల్ స్నఫ్‌కలర్ శారీనే కట్టుకుంది.**

వనమాలి మెరుపుతీగలా వుండకపోవచ్చు. కానీ ఆమెను చూడగానే ఎవరికైనా మనసులో ఓ మెరుపు అలా తళుక్కున మెరవకుండా వుండబోదు.

గులాబీపువ్వు అందం వేరు. మల్లెపూవు అందం వేరు. దేని అందం దానిదే. కానీ వనమాలి అందం మల్లెపూవులా నిర్మలమైనది.

ప్రతి ఆడపిల్ల జీవితంలో పెళ్ళిచూపులు ఓ అద్భుతమైన ఎపిసోడ్! అన్నీ కుదిరి అర్ధాంగిగా మారితే అదో తీపి జ్ఞాపకమౌతుంది. లేకుంటే చేదుగుర్తుగా మిగిలిపోతుంది.

'అతనెలా వుంటాడో..పెళ్ళి చూపులకొచ్చేవాడ్ని పెళ్ళికొడుకని అనొచ్చా..ఏమో!' తనలో తానే నవ్వుకుంది వనమాలి.

సరిగ్గా అలా ఆమె ఎదురుగా నిలబడి నవ్వుతున్నప్పుడే ఆ ఇంటి గుమ్మం ముందు కారాగింది. కారులో కూర్చుని విండోలోంచే ఆ నగుమోమును కనగలిగిన విశ్వప్రియతమ్ మనసులో మెరుపే మెరిసింది.

'అనొచ్చో లేదో తెలియదుగానీ అచ్చూ పెళ్ళికొడుకులానే తయారైవచ్చాడు' అనుకుంటూ అతనికి కూల్ డ్రింక్ అందించింది వనమాలి. అందుకుంటూ 'చార్మింగ్ డార్లింగ్ ఆఫ్ ది మిలియన్స్' అనుకున్నాడు విశ్వప్రియతమ్ ఆమెకేసి అలాగే చూస్తూ.

"మీ పేరు, మీ వయసు, మీ ఎత్తెంత, మీకు పాటలొచ్చా..ఆటలొచ్చా..ఏదీ ఓ సారి గెంతి చూపించండి. ఓ కూనిరాగం ఆలపించి మమ్మల్ని మరిపించండి' లాంటి రొటీన్ ఫార్మాట్ ప్రశ్నలు విశ్వప్రియతమ్ వేయలేదు. కానీ చిన్నగా ఏదో వాళ్ళ నాన్నగారి చెవిలో గొణిగాడు.

దాంతో వాళ్ళ నాన్నగారు వనమాలి తండ్రినడిగారు "మా అబ్బాయి మీ అమ్మాయితో విడిగా మాట్లాడాలనుకుంటున్నాడు మీకు అభ్యంతరం లేకపోతే?"

ఆడపిల్లలకూ ఓ వ్యక్తిత్వం వుంటుందని ప్రగాఢంగా నమ్మే వనమాలి తండ్రి కూతురివైపు చూశారు ఆమె అంగీకారం కోసం. ఆమె కళ్ళతోనే తన అంగీకారం తెలుపుతూ పైకి లేచింది.

వాళ్ళకోసం మిగతా అందరూ లేచి బయటకు వెళ్ళడం కన్నా ప్రయివేట్‌గా మాట్లాడుకోవాలనుకున్న తామే లేచి బయటకు వెళ్ళడమే పద్ధతిగా వుంటుందని తలచి చిన్నగా బయటకొచ్చి డాబా మీదకు దారి తీసింది. ఆమె భావనను ఇట్టే అర్థం చేసుకున్న వాడిలా అతనూ పైకిలేచి ఆమెను అనుసరించాడు.

సాయంకాలం మబ్బుల్తో వాతావరణం చల్లగా, ఆహ్లాదకరంగా వుంది. ఆ డాబా ఆమెకు చాలా ఇష్టం. ఆమె ఎక్కువగా ప్రేమించేది ఆ డాబానే.

కవ్వించే వయసులో తుళ్ళిపడే మనసుతో తను ప్రేమించిన వంశీకృష్ణకు ఈ డాబా మీదే కూర్చుని కూనిరాగాలు తీస్తూ ప్రేమలేఖలు రాసింది. చివరకు వంశీకృష్ణ నిజస్వరూపం తెలిశాక తనెంత మోసపోయిందో అర్థమయ్యాక కన్నీటి పర్యంతం కుమిలిపోయింది కూడా ఈ డాబా మీదే! అందుకే వనమాలికి ఆ డాబా అంటే అంతిష్టం.

"చూడండి వనమాలిగారూ! నా పేరు మీకు తెలిసే వుంటుంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఓన్ ప్రాక్టీస్ చేస్తున్నాను. ఒక్క వంద రూపాయల తేడాతో ఇన్‌కమ్ టాక్స్ గండం నుంచి తప్పించుకున్న సంవత్సరాదాయం నాది. సిటీలో హ్యాపీ లైఫ్ లీడ్ చేయొచ్చనుకుంటాను నా సంపాదనతో. ఇక హైట్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదనుకుంటాను. అయినా ఓ మాటనుకుందాం దీని గురించి కూడా. చూశారా..నా మాటలకు మీరలా నవ్వుతూంటే చొట్టలుబడ్డ మీ బుగ్గల్ని కళ్ళతో కాక నా హృదయంతో చూసేంత ఎత్తుగా వున్నాను" అంటూ ఎంతో సరదాగా చెప్పుకుపోతున్నాడు విశ్వప్రియతమ్ తన బయోడేటాను.

అందంగా వుండటం వేరు. అందంగా మాట్లాడటం వేరు. ఈ రెండూ ఒకరిలోనే వుండటం చాలా అరుదు. అలా అరుదైన వాళ్ళలో విశ్వప్రియతమ్ మొదటివాడు.

అతని మాటలు ఆసాంతం విన్నాక నవ్వుతూనే అడిగింది వనమాలి. "అంటే ఆడ వాళ్ళకన్నా మగవాళ్ళే ఎక్కువనే వ్యత్యాసం మీ మాటల్లో ప్రాజెక్ట్ అవుతోంది"

"మీరలా అర్థం చేసుకునుంటే అర్జెంటుగా నన్ను క్షమించేయండి మిస్ వనమాలీ! సాధారణంగా ప్రతీ ఆడపిల్లా తనని పెళ్ళిచేసుకునే భర్త తనకన్నా గొప్పవాడై వుండాలని కోరుకోవడం సహజమే కదా! నేనంత గొప్పవాడ్ని కాకపోయినా మీకు భర్తగా అర్హత వున్నవాడినే అని చెప్పాలన్నదే నా ఉద్దేశ్యం" అన్నాడు అతను.

వెంటనే నొచ్చుకుంది వనమాలి. అలా అడగకుండా వుండాల్సింది అని మధనపడింది. అదే విషయం అతనితో చెప్పబోతుంటే ఇంతలో అతనే అడిగాడు.

"మిస్ వనమాలీ! మీ బయోడేటా వినే అదృష్టం కలుగజేస్తారా?" ఆమె ఎంతో ఆశ్చర్యపోయింది. నిజానికి అతనిలోని ఆ హుందాతనం, చతురత, వినయం..చూస్తుంటే పెళ్ళిచూపుల్లా లేదు. చాన్నాళ్ళనుంచీ పరిచయం వున్న స్నేహితుడ్ని ఇంటికి 'టీ'కి ఆహ్వానించినట్లే వుంది.

"నా పేరు ప్రత్యేకించి చెప్పక్కర్లేదనుకుంటాను. ఎందుకంటే ఇప్పటికి మీరు సరిగ్గా మూడుసార్లు ముచ్చటగా నా పేరుని వాడారు. ఓ వేళ వచ్చే ఏడాది ప్రభుత్వం మనసు మార్చుకుని మీకు ఇన్‌కంటాక్స్ గండం కల్పిస్తే ఆ గండం నుంచి తప్పించుకోవడానికి ఎన్నో మార్గాలు మంచినీటి ప్రాయంగా చెప్పగలిగే విజ్ఞానాన్ని నా పోస్ట్‌గ్రాడ్యుయేషన్ నాకు ప్రసాదించింది. యం.కామ్. తర్వాత కామ్‌గా కూర్చోలేక కాలక్షేపం కోసం కంప్యూటర్‌లో సర్టిఫికేట్ కోర్స్ చేశాను.

జీవితంలో నాకు స్థానమిచ్చే భర్త ముందు హృదయంలో స్థానం కల్పించాలి అని కలలు గన్న దాన్నవడంతో నా ఎత్తు సరిగ్గా మీ హృదయం వరకే వుండటం నా అదృష్టంగా భావిస్తాను" చెప్పింది వనమాలి భావుకత నిండిన గొంతుతో.

ఆమె మాటలకు అతను మరింత ముచ్చటపడ్డాడు. అందుకే చెప్పాడు "నాకు మీరు బాగా నచ్చారు వనమాలీ! నేను ఎలాంటమ్మాయినైతే పెళ్ళి చేసుకోవాలని మొదటి మొటిమ నా ముఖం మీద కవాతు చేసినప్పట్నుంచీ కలలు కన్నానో అచ్చూ మీరు అలానే వున్నారు. మీ అభిప్రాయం కూడా చెబితే?" అంటూ ఆగిపోయాడు ఆమె వైపు చూస్తూ.

వనమాలి పిట్టగోడకానుకుని చేతులు కట్టుకుని ఆకాశంకేసి చూడసాగింది.

కల్మషం లేని స్వచ్ఛతకు ప్రతీకైన నిర్మలాకాశాన్ని చూస్తుంటే ఎదురుగా నిల్చొని తనతో మాట్లాడుతున్న విశ్వప్రియతమ్ మనసుని బైనాక్యులర్స్‌తో చూస్తూన్నట్లనిపించింది.

అలా అనిపించగానే ఆమెకు అతనిమీద ఎక్కడలేని



గౌరవం, అభిమానం, సదభిప్రాయం ఏర్పడ్డాయి.

అందుకే అతన్ని మోసం చేయడం ఆమెకిష్టం లేదు. ఎల్లాగైనా ఆ విషయం చెప్పేయాలనుకుంది విశ్వప్రియతమ్‌కు. ఓ వేళ చెప్పకపోతే పెళ్ళయ్యాక తన అంతరంగం అంగీకరించదు. 'ఇంత మంచి మనిషిని మోసం చేశానా?' అన్న గిల్టీనెస్‌తో చిత్రవధ పడాల్సొస్తుంది. సరే అంతా విన్నాక అతను 'నో' అని చెబితే?

అలాగే ఆకాశంకేసి చూస్తుండిపోయింది. మేఘాలు చిన్నగా కదులుతూ పోతున్నాయి. పాసింగ్ క్లౌడ్స్! సరిగ్గా అలాంటి పాసింగ్ క్లౌడ్స్‌లాంటి పరిచయమే వంశీకృష్ణ!

టైమ్ పాస్ కోసం కంప్యూటర్ కోర్స్‌లో చేరిన రోజులవి.

వనమాలి ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్తూ వెళ్తూ అనుకోకుండా ఓరోజు హ్యాండ్‌బ్యాగ్ పారేసుకుంది. మరోరోజు కంప్యూటర్ ఫైల్ పారేసుకుంది. ఏకంగా ఇంకో రోజు తన మనసే పారేసుకుంది.

వంశీకృష్ణ ఆ ఇన్‌స్టిట్యూట్‌లో ఇన్‌స్ట్రక్టర్! మూసివున్న పడుచుపిల్లల గుండె తలుపులు తెరవడం అతనికి కంప్యూటర్‌తో పెట్టిన విద్య! ఆ విద్యనే ఉపయోగించి వేరే వాళ్ళందికీ సాఫ్ట్‌వేర్ పాఠాలు నేర్పించి ఒక్క వనమాలికి మాత్రం ప్రేమ పాఠాలు నేర్పించాడు.

వనమాలి అతన్ని గుడ్డిగా నమ్మింది. అతనితోపాటు చెట్టాపట్టాలేసుకుని తిరిగింది.తిరిగీ తిరిగీ అలసిపోవడంతో అలుపు తీర్చుకోవడానికని "మన పెళ్ళెప్పుడు వంశీకృష్ణా!" అని ప్రశ్నించింది. దానికి సమాధానంగా అతను హేళనగా నవ్వాడు.

"నా పెళ్ళయితే ఇంకా రెండు మూడేళ్ళ తర్వాతే వుండొచ్చు. మరి నీ పెళ్ళి సంగతి నేనెలా చెప్పగలను" అన్నాడు ఎంతో విట్టీగా వంశీకృష్ణ.

"ఏంటీ..వున్నట్లుండి ధ్యానముద్రలోకి వెళ్ళిపోయారు?" అడిగాడు విశ్వప్రియతమ్ ఆమె ముఖకవళికలు గమనించి.

అప్పుడు కానీ ఈ లోకంలోకి రాలేదు వనమాలి. తేరుకుని ఏదైతే అదైందని నోరు తెరిచింది.

"ముఖ్యంగా మీతో ఓ విషయం చెప్పాల్సిన కనీస బాధ్యత నామీదుంది. అంతా విన్నాక కూడా మీరు 'యెస్' అంటే నా అంత అదృష్టవంతురాలు ఇంకొకరుండరు" అంటూ వంశీకృష్ణతో ఓ సంవత్సరంపాటు నడిచిన తన ప్రేమ వ్యవహారాన్ని చెప్పింది.

అంతా ఎంతో ఓపిగ్గా విన్నాడు. ఇంతలో బాగా చీకటి పడడటంతో వచ్చిన పెద్దవాళ్ళు కిందనుంచే పెద్దగా పిలవడంతో ఏమీ బదులివ్వకుండానే అతను కిందకి వచ్చేసి కారులో కూర్చున్నాడు. ఆ తర్వాత కారు కదిలి వెళ్ళిపోయింది.

కానీ ఆ రాత్రి వనమాలికి కాళరాత్రే అయింది.

ఓ వేళ చెప్పకుండా వుంటే బావుండేదేమో! ఏదేమైనా అలా చెప్పేయడంతో వంశీకృష్ణ జ్ఞాపకాల మురికిని పూర్తిగా కడిగేసుకున్నట్లుగా తోచింది.

మర్నాడు వారి నుంచి వార్త విని నిజంగా ఆమెకన్నా ఎక్కువ ఆనందంగా వున్నవారు మరొకరుండరు ఆ క్షణంలో! ముహూర్తాలు పెట్టించేశారు. మూడుముళ్ళూ వేయించేశారు. అలా వేయించిన మూడు రోజుల తర్వాత రాత్రిపూటకు మాత్రమే ఓ మంచి ముహూర్తం చూడమన్నారు.

"ఈ రాత్రికే దివ్యమైన ముహూర్తం వుంది" అన్నారు పంతులుగారు.

దాంతో ఆ రాత్రే భోజనం ఏర్పాటు చేశారు.

వెండిగ్లాసులో పాలు ఖాళీచేసి ఆపై ఆ బంగారు బొమ్మను అమాంతంగా లాక్కొని ఆస్వాదించబోతుంటే అప్పుడామె అందికదా-

"ఏయ్ నిజం చెప్పు నా గతం విన్నా నా మీద నీకు కోపం రాలేదా?" అంటూ డైరెక్ట్‌గా ఏకవచన ప్రయోగంలోకి దిగిపోయింది.

"కోపమెందుకొస్తుంది. గౌరవం పుట్టుకొస్తుంది కానీ. అవును. నీ నిజాయితీ నన్నెంతగానో ఆకట్టుకుంది. తెలిసీ తెలియని టెండర్ ఏజ్‌లో యువతీ యువకులంతా ఇలాగే గుడ్డివాళ్ళవుతారు. గుడ్డిగా ప్రేమలో పడతారు. నీదీ అటువంటి గుడ్డిప్రేమే! సో..సే గుడ్ బై టు యువర్ గుడ్డి ప్రేమ..ఇంకెప్పుడూ మన మధ్య మాటల్లో కూడా గుర్తుచేయొద్దు" అంటూ ఆమెను అల్లుకుపోయాడు విశ్వప్రియతమ్!

అలా విశ్వప్రియతమ్, వనమాలి ఓ జంటయ్యారు. అందమైన జంట! ఆనందంగా తమ దాంపత్య జ్యోతిని వెయ్యి క్యాండిల్స్ బల్బులా వెలిగించసాగారు.

ఓ వారం తర్వాత వనమాలి ఏమీతోచక అల్మారాలోని భర్త తాలూకూ పాత ఆల్బమ్ తీసి చూస్తూ చూస్తూ ఉన్నట్టుండి ఓ ఫొటోని చూడగానే అంతే..! ఆమె గుండె ఝల్లుమంది. భర్త రాగానే అడగాలనుకుంటూండగానే విశ్వప్రియతమ్ రావడం, వచ్చి ఎంతో క్యాజువల్‌గా "ఇతను..యం.సీ.ఏ.లో నా క్లాస్ మేట్" అన్నాడు ఆ ఫొటో వైపు చూస్తూ.

లోలోపల మాత్రం ఇలా అనుకున్నాడు. 'కొంతమంది నిజాల్ని దాచిపెట్టి పరిస్థితుల్ని చక్కబెట్టాలనుకుంటారు. కానీ వనమాలి మాత్రం నిజాల్ని నిర్భయంగా ముందే బయటపెట్టి పరిస్థితుల్ని చక్కబెట్టుకుంది'

అన్నట్టు అతని ఎం.సీ.ఏ. క్లాస్‌మేట్ మరెవరో కాదు. వంశీకృష్ణ!